క్లుప్తంగా

జోరుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు



ట్రాక్టర్‌తో తరలిస్తున్న గ్రావెల్

కోటనందూరు: స్థానిక గొంపకొండపై గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పంచాయతీకి పైసా కట్టకుండా రాజకీయ నాయకుల అండదండలతో గ్రావెల్ మాఫియా జేబులు నింపుకొంటుంది. పట్టపగలే మితిమీరిన వేగంతో ట్రాక్టర్లలో గ్రావెల్‌ను తరలిస్తూ జనజీవనానికి ఇబ్బంది కలిగిస్తున్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తమ కళ్లముందే గ్రావెల్‌ను తరలించేస్తున్నా..అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ దందా సాగిస్తున్న గ్రావెల్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి కుటుంబానికి పరామర్శ



మాజీ ఎంపీటీసీ గింజాల అప్పారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని రూరల్: తుని మండలం రాజుపేటకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు గింజాల అప్పారావు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. బుధవారం గ్రామానికి వెళ్లిన యనమల కృష్ణుడు సర్పంచ్ బుద్దాల సత్తిబాబు, వద్దాది ఏసుబాబు, కిల్లాడ గోవిందుతో కలసి అప్పారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తనిఖీలు పారదర్శకంగా నిర్వహించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ జె.శ్రీనివాస్ అధ్యక్షతన ఉపాధి పనులపై జరిగే సోషల్ ఆడిట్‌పై రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 2023–24 ఏడాదిలో రూ.8 కోట్లపైగా ఉపాధి పనులు చేశారన్నారు. ఆడిట్ సిబ్బంది పనుల్లో లోపాలను గుర్తించాలన్నారు. ఎటువంటి అవకతవకలు జరిగినా రికార్డులు సరిలేకున్నా ఆడిట్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉపాధి పనుల్లో నాణ్యతతో కూడిన పనులు ద్వారా రైతులు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, ఏపీఓ రాజ్‌గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

తాండవ గ్రోయిన్ల అభివృద్ధికి కృషి



కోటనందూరులో తాండవ గ్రోయిన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివ్య

కోటనందూరు: శిథిలావస్థలో ఉన్న తాండవ గ్రోయిన్ల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన కొత్తకొటాంలో కండివాగు, కోటనందూరులో తాండవ గ్రోయిన్లను ఎమ్మెల్యే పరిశీలించారు. కొత్తకొట్టాంలో కండివాగు ముంపునకు గురికావడానికి గల కారణాలు, ముంపు వల్ల నష్టం వాటిల్లే పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కండివాగు వల్ల రైతులు, స్థానికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రోయిన్ల అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గాడి రాజబాబు, వెలగా కృష్ణారావు, బోడపాటి సత్తిబాబు, షేక్ మీరాబాయి, వాసం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వర్షం తగ్గుముఖం

గండేపల్లి: తుపాను ప్రభావంతో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షం తగ్గుముఖం పట్టడంతో ప్రజలు తమ పనుల్లో నిమగ్నమయ్యారు. మంగళ, బుధవారాల్లో ఎండ ఉండడంతో ప్రజలు కాస్త ఊరట పొందారు. కొన్ని రోజులుగా కురిసిన వర్షం కారణంగా చల్లబడిన వాతావరణం బుధవారం ఎండతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్

- ధర్మవరం రహదారికి మహర్దశ
- రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టిన గ్రామ పంచాయతీ
- ఆక్రమణల తొలగింపునకు నోటీసుల జారీ
- శరవేగంగా జరుగుతున్న పనులు



ధర్మవరంలో ఎదురెదురుగా వాహనాలు రావడంతో నిలిచిన ట్రాఫిక్



స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగిస్తున్న ఆక్రమణదారులు

ప్రత్తిపాడు రూరల్: నిత్యం వందలాది బస్సులు తిరిగే ధర్మవరం ప్రధాన రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ రహదారి ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇటు రాజమహేంద్రవరం నుంచి తుని వైపు, అటు తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఈ రోడ్డు నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే కదల్లేని పరిస్థితి ఉంది. ఆ సమయంలో గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడే దుస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

ధర్మవరంలోని జగనన్న కాలనీ దగ్గర నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు రహదారి ఇరువైపులా ఆక్రమణలకు గురైంది. కళ్ల ముందే భారీ అక్రమ కట్టడాలు ఉన్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో ఇప్పటి వరకూ ఎవరూ పట్టించుకోవడంలేదు. ఈ అక్రమ కట్టడాలను తొలగించేందుకు చొరవ తీసుకోలేదు. తాజాగా గ్రామస్తులు ఈ సమస్యను కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. తదానంతరం పంచాయతీ అధికారులు రోడ్డుకు ఆనుకొని ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలంటూ ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. దీంతో నోటీసులు అందుకున్న వారు ఆక్రమణలను తొలగించేందకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ప్రస్తుతానికి స్థానిక పశువుల ఆసుపత్రి నుంచి సినిమా హాల్ సెంటర్, జాతీయ రహదారి వరకూ అక్రమ కట్టడాలను తొలగించే పనులను స్థానికులు స్వచ్ఛందంగా చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

ధర్మవరం గ్రామంలో 16 వేల జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో జగనన్న కాలనీ నుంచి సినిమా హాలు సెంటర్ వరకు రెండున్నర కిలోమీటర్ల వరకు ప్రధాన రహదారి ఉంది. ఈ రోడ్డు మీదుగా తుని–రాజమహేంద్రవరం వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రతి 15 నిమిషాలకు ఒక్క బస్సు వెళుతుంది. అదే స్థాయిలో ఇతర ప్రైవేటు వాహనాల సైతం ఈ రహదారి నుంచే రాకపోకలు సాగిస్తాయి. రోడ్డు ఇరుకుగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో స్థానికులతోపాటు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

అభినందనీయం



ప్రస్తుతం పంచాయతీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం అభినందనీయం. అయితే ఆక్రమణలు తొలగించిన తర్వాత రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

–ఊటా వీరబాబు, గ్రామస్తుడు, ధర్మవరం

ఆక్రమణలు తొలగిస్తున్నాం



ప్రజల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టింది. ఆక్రమణలు తొలగించేందుకు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశాం. దీనికి ఇప్పటికే గ్రామంలో కొంత మంది ఆక్రమణదారులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా ఆక్రణలను తొలగిస్తున్నారు. గ్రామంలో జగనన్న కాలనీ దగ్గర నుంచి సినిమా హాల్ జంక్షన్ వరకు ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నాం.

–బెంతుకుర్తి సుశీల, గ్రామ సర్పంచ్, ధర్మవరం

హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలం



ఏలేశ్వరంలోని పార్టీ పతాకావిష్కరణలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శేషుబాబ్జీ

ఏలేశ్వరం: ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్ అన్నారు. జాతీయ మహా సభల షెడ్యూల్ విడుదల పురస్కరించుకుని పట్టణంలో బుధవారం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆపడం, రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌లో రూ.58 కోట్లు కేటాయించగా రాష్ట్రానికి నిధులు కేటాయింపులో కూటమి ప్రభుత్వం చేతకానితనం బయటపడిందన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు పాల్గొన్నారు.

మండల కార్యదర్శిగా సోమరాజు

సీపీఎం మండల కార్యదర్శిగా పాకలపాటి సోమరాజు మరోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా నాయకుడు దువ్వా శేషుబాబ్జీ ప్రకటించారు. సోమరాజు పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గండేపల్లి: యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్టు యూత్ రెడ్‌క్రాస్ యూనిట్ ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్ మిస్టర్ పి.శివకుమార్ తెలిపారు. థలసేమియా విక్టిమ్స్ కోసం నిర్వహించిన ఈ శిబిరం ద్వారా రాజమహేంద్రవరం సత్య సూర్య బ్లడ్ బ్యాంక్‌కు 126 మంది, పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్‌కు 181 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి, డీన్ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



గోనేడలో నీట మునిగిన పంట పొలాల్లోకి దిగి నిరసన వ్యక్తం చేస్తున్న కర్నాకుల

కిర్లంపూడి: వరదలకు పంటను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించి, బ్యాంకు రుణాలు మాఫీ చేయాలన్నారు. బుధవారం ఆయన గోనేడ శివారు ఏలేరు కాలువ గట్టు గండిని, నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. వీరాంజనేయులు మాట్లాడుతూ ఏలేరు కాలువ ఆక్రమణలకు గురికావడంతోనే పంట పొలాలు తరచూ నీట మునిగి వేలాది మంది రైతులు నష్టపోతున్నారన్నారు. ఏలేరు కాలువ సమీపంలో ఉన్న గ్రామాలు మునిగిపోవడంతో ప్రజలకు ఇళ్లను కోల్పోయి అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విపత్తులు జరిగిన తరువాత నాయకులు సందర్శించడమే తప్ప శాశ్వత పరిష్కారాలు చూపడంలేదన్నారు. ఏలేరు పరివాహక గ్రామాల్లో వరదలకు ఇళ్లు కోల్పోయిన వారందరికీ పక్కా గృహాలు కట్టించాలని, ఆరు నెలలపాటు నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణాలో హైడ్రా చట్టం తీసుకొచ్చినట్టు ఆంధ్రప్రదేశ్‌లో కూడా అటువంటి చట్టాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ భూముల్లో చేపట్టిన ఆక్రమణలను తొలగించాలని వీరంజనేయులు సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, డాన్ శ్రీను, కానూరి సత్తిబాబు, స్థానిక రైతులు ఉన్నారు.

ఏలేశ్వరంలో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఏలేశ్వరం:గణపతి నవరాత్రుల్లో భాగంగా పట్టణంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. శ్రీలక్ష్మి గణపతి టాక్సీ ఓనర్స్‌అండ్ వర్కర్స్ యూనియన్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ వినాయకుని ఆలయం వద్ద పోటీలు నిర్వహించగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోటీల్లో బి.గంగాభవాని ప్రథమ బహుమతి, లక్ష్మి ద్వితీయ బహుమతి, ఎం.భాను, మాధవి తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సొల్లేటి నరసింహ, శిడగం సురేష్ ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్, శ్రీను, గణేష్, గంగరాజు, బాబుల్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

గండేపల్లి: వ్యవసాయం లాభసాటిపై సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అతిథి ఉపన్యాసం నిర్వహించినట్టు డిప్యూటీ వైస్ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైపర్ స్పెక్ట్రల్ ఇమేజ్ ప్రాసెసింగ్‌ను వినియోగించి పంటలు, పండ్లలో పలు వ్యాధులను సకలంలో గుర్తించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవచ్చునని వివరించారు. వైఎస్ఆర్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగంలో రిసోర్స్ పర్సన్‌గా ఎం.నవీన్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



తోట నరసింహం, వైఎస్సార్‌సీపీ జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌చార్జి

కిర్లంపూడి: విజయవాడలో వరద నుంచి ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. బుధవారం 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు ముంపు బారినపడ్డారని అన్నారు. ప్రభుత్వ పెద్దల ఆస్తులను కాపాడుకునేందుకు బుడమేరు వాగు గేట్లు ఎత్తి వేశారని, దాని వల్ల విజయవాడను వరద ముంచేసిందన్నారు. బుడమేరుతో ప్రమాదం పొంచి ఉందని అధికారులు హెచ్చరించినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 50 మంది మృతి చెందారన్నారు. వరద ప్రళయంతో అన్ని వర్గాల ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కనీసం ఆహారం, తాగునీరు అందించకపోవడంలో కూడా విఫలమైందన్నారు. సీఎం చంద్రబాబు వరద బాధితుల సమస్యలు పక్కనపెట్టి వరద నీటికి కొట్టుకొచ్చిన పడవల చుట్టూ రాజకీయం చేయడం సరికాదన్నారు. వరదబాధితులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రచార ఆర్భాటాలు మానుకుని వరద బాధితులకు సహాయం అందిచాలన్నారు.

అటవీ అమర వీరులకు నివాళులు



సూదికొండలో అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

గోకవరం: అటవీ అమర వీరుడు పందిళ్లపల్లి శ్రీనివాస్ సేవలు మరువలేనివని ఫోక్స్‌పేట రేంజ్ అధికారి ఎం.కరుణాకర్ అన్నారు. సూదికొండ గ్రామంలో ఫోక్స్‌పేట అటవీశాఖ కార్యాలయంలో అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని బుధవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అశువులు బాసిన పందిళ్లపల్లి శ్రీనివాస్‌తోపాటు 23 మంది అటవీ అమరవీరులకు నివాళులర్పించారు. రేంజర్ కరుణాకర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన అటవీ అమర వీరుల స్ఫూర్తిని కొనసాగించి అడవిని సంరక్షించాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సుజాత, సిబ్బంది నూకరాజు, అప్పారావు, వరలక్ష్మీ, జగదీష్, ప్రశాంత్, పద్మ, అరుణ, శ్రీను, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



సీతారాంపురంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో స్తంభం

తొండంగి: సీతారాంపురం ప్రధాన రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్‌తో ఉన్న విద్యుత్‌స్తంభం ప్రమాదకరంగా ఉంది. సీతారాంపురం నుంచి కొమ్మనాపల్లి వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసి ప్రధాన విద్యుత్ లైన్‌లో సీసీరోడ్డు వద్ద విద్యుత్‌స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. సీసీరోడ్డుకు అత్యంత దగ్గరలో ఉండడంతో రాత్రి సమయాల్లో ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. వర్షాకాలం కావడంతో తరచూ విద్యుత్‌షాక్ తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ స్తంభాన్ని రోడ్డుకు దూరంగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వరద బాధితులకు అండగా తిరుపతి సీజీఎం



వీరవరంలో బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న సీజీఎం సంస్థ సభ్యులు

కిర్లంపూడి: ఎక్కడ ఏ ఆపద వచ్చిన పెద్దాపురం మండలంలోని తిరుపతి సీజీఎం స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలుస్తుందని క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ సంస్థ వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అన్నారు. మండలంలోని వీరవరంలో ఇంటింటికి వెళ్లి 2500 మంది వరద బాధితులకు బుధవారం సాయంత్రం ఆహార పొట్లాలను అందజేశారు. అలాగే వీరవరంలో వరద ముంపులో ఉన్న కుటుంబాలకు ఆహార పొట్లాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అభిషేక్, వంకా జాన్, జయకుమార్, జేమ్స్, బ్లెస్సింగ్, శాంతి వర్ధన విభిన్న ప్రతిభా వంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, ఐజేయు సభ్యులు ఆర్.రాంబాబు, పోలవరపు పైడిరాజు, ఆముదల వీరబాబు, వల్లభశెట్టి గణేశ్, సీజీఎం సభ్యులు పాల్గొన్నారు.

వీరవరంలో ఆహారం పొట్లాల పంపిణీ

వీరవరంలో వరద నీటి ముంపుకు గురై ఇళ్లకే పరిమితమైన కుటుంబాలకు బుధవారం రాత్రి యువ నాయకుడు తోట రాంజీ ఆహారం పొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌చార్జి తోట నరసింహం ఆదేశాల మేరకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఆహార పొట్లాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



వెదురుపాక ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

గోకవరం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెదురుపాక ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆరుగొల్లి జోగిరాజుని బుధవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పాఠశాల విద్యాకమిటీ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు జోగిరాజును పూలమాలలు, శాలువాలతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. అలాగే పాఠశాలలో ఇతర ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ మడక శివ, కొరిపల్లి అప్పలస్వామి, పిల్లా అర్జునసారధి, బత్తుల సారంగధరుడు, మాజీ సర్పచ్ బొట్టా రామకృష్ణ, కొత్తల వీరఅప్పారావు, దాసరి నాగవిష్ణు, గొంతిన అప్పలస్వామి, మడక వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



వేళంగిలో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

శంఖవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం వల్లే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. వేళంగి అంగన్‌వాడీలో వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు నెలకు సరిపడే పౌష్టికాహారం అందిస్తుందన్నారు.

విజయవాడ వరద బాధితులకు విరాళాల సేకరణ



గోకవరంలో విరాళాలు సేకరిస్తున్న నాయకులు, పలు యూనియన్ సభ్యులు

గోకవరం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం గోకవరంలోని వివిధ యూనియన్ నాయకులు, గ్రామపెద్దలు, స్థానిక నాయకులు విరాళాలు సేకరించే కార్యక్రమం చేపట్టారు. బుధవారం తొలిరోజు గ్రామంలో జోలెపట్టి వ్యాపారస్తులు, నాయకుల నుంచి విరాళాలాలు సేకరించారు. సుమారు రూ.41 వేలను సేకరించారు. ఆ మొత్తాన్ని వరద బాధితులకు పంపించనున్నట్టు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు, ఇనకోటి బాపన్నదొర, ఆచంట రాజు, చోడిశెట్టి గోపీనాథ్, ఆటో యూనియన్ అధ్యక్షుడు గవిని దుర్గాప్రసాద్ తెలిపారు.

చురుగ్గా అనివేటి మంటపం పనులు



అనివేటి మంటపంలో గ్రానైట్ ఫ్లోరింగ్ చేస్తున్న కార్మికులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో స్వామివారి ఆలయానికి దిగువన ఉన్న అనివేటి మంటపంలో రూ.7.50 లక్షల వ్యయంతో తెలుపు రంగు రఫ్ గ్రానైట్ పలకలు అమర్చే పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఈ మంటపంలో ఎరుపు రంగు మార్బుల్స్‌తో ఫ్లోరింగ్ చేశారు. అయితే ఈ మంటపంలో రూ.1500 వ్రతాలు నిర్వహిస్తుండడంతో నూనె మరకలతో ఆ ఫ్లోర్ అంతా అపరిశుభ్రంగా మారింది. దీంతో ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులు తెలుపు రంగు గ్రానైట్‌తో ఫ్లోరింగ్ పనులు చేయిస్తున్నారు. 15 రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ మహిళ

గోకవరం: రామన్నపాలెం గ్రామ శివారున బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ మేరకు ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన ప్రకారం.. రంపచోడవరం వైపు నుంచి మహిళతో పాటు మరో వ్యక్తి బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న కారుని ఢీకొట్టడంతో మహిళ తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న ఎస్సై పవన్‌కుమార్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారి పూర్తి వివరాలు తెలియరాలేదు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెదశంకర్లపూడి, ఒమ్మంగి గ్రామాల్లో వరద నీట మునిగిన పంట పొలాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ పెద్దల సహకారంతో పెద్ద శంకర్లపూడి ఎర్రకాలువపై స్లూయిజ్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. వరద ఉధృతికి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని వారు రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంల జిల్లా సైనిక్ సెల్ విభాగ కన్వీనర్ కర్రి ధర్మరాజు, పార్టీ నాయకులు, ఏనుగు సుబ్రహ్మణ్యం, రామకుర్తి సూర్యనారాయణ, ఊటా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: మండలంలో పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు కోరుకొండ సీడీపీఓ ఝాన్సీరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక మినీ కార్యకర్త, ఐదు సహాయకురాలు పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. గాదెలపాలెంలో మినీ కార్యకర్త పోస్టు ఓసీ క్యాటగిరీకి, గుమ్మళ్లదొడ్డిలో సహాయకురాలు పోస్టు బీసీ–ఎ, గోకవరం 5 సెంటర్ ఓసీ, సూదికొండలో ఎస్సీ, ఠాకూరుపాలెంలో ఓసీ, కామరాజుపేట 5లో బీసీ–డీ క్యాటగిరిలకు కేటాయించినట్టు తెలిపారు. అర్హులైన వారు ఈనెల 20 నాటికి దరఖాస్తులను కోరుకొండ సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.